క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ డి.శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదకరంగా వేలాడుతున్న తీగలను సరిచేసి స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

24 నుంచి ఆరోగ్య శిబిరం

నిర్మల్‌టౌన్: మహాదేవ్ శక్తి సంస్థాన్ ట్రస్ట్ నిర్మల్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్‌లోని రాజశ్యామల ఆలయంలో ఈనెల 24 నుంచి 28 వరకు ఆరోగ్య సేవా శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ శ్రీవాణి (ఎండీ ఆయుర్వేదం) వైద్యపరీక్షలు నిర్వహించి, శివరాజ యోగి కృష్ణ స్వామీజీ దివ్యశిక్షణలో ప్రాణయామం, యోగా, ధ్యానం, ఎనర్జీ హీలింగ్ పద్ధతుల ద్వారా వ్యాధులను నయం చేసుకునే శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. మందులు అందించనున్నట్లు వివరించారు. 50 మందికి మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నామని.. రిజిస్ట్రేషన్ కోసం 81258 61569 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భద్రత ఏర్పాట్లు పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న సీఐ గోపినాథ్

భైంసాటౌన్: బ్యాంకులు, బంగారంపై రుణాలిచ్చే సంస్థలు, ఆర్థిక లావాదేవీలు నిర్వహించే సంస్థల కార్యాలయాల్లో పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐ జి.గోపినాథ్ సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్‌బీఐ, యూబీఐతోపాటు ఇతర ప్రైవేట్ బ్యాంకులు, బంగారంపై రుణ ఆర్థికసంస్థల బ్రాంచి కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రత పరిశీలించారు. ఇటీవల కర్ణాటకలో సినీ ఫక్కీలో భారీ చోరీ జరిగిన నేపథ్యంలో అప్రమత్తం చేసేలా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సీఐ తెలిపారు.

మహిళను రక్షించిన యువకులు

నర్సాపూర్(జి): చెరువులో పడిన ఓ మహిళను యువకులు రక్షించిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు నర్సాపూర్(జి) మండల కేంద్రానికి చెందిన అవర్గ రాజవ్వ ప్రమాదవశాత్తు ఊర చెరువులో జారి పడింది. స్థానికులు గమనించి గ్రామ యువకులు ఎండీ.జాబీర్, గాడి రాజు, సంతోష్, రామ్‌కు సమాచారం అందించగా వారు వచ్చి మహిళను కాపాడారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై గణేశ్ మహిళను 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకులను అభినందించారు.

ట్రస్మా కార్యవర్గం

కడెం: మండలకేంద్రంలో ఉమ్మడి కడెం మండల టస్మా (ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం) కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మునీర్, సెక్రటరీగా వినీత, కోశాధికారిగా వినీత్, ఉపాధ్యక్షుడిగా గంగాధర్, జాయింట్ సెక్రటరీగా సురేశ్‌ను టస్మా జిల్లా జనరల్ సెక్రటరీ ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ గ్రామంలో శనివారం ప్రకృతి విపత్తులపై ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ ఆవరణలో 16వ బెటాలియన్ ఎస్సై జితేందర్‌సింగ్ తన బృందంతో ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల వేళ మనోధైర్యం కోల్పోకుండా మనల్ని మనం కాపాడుకునే తీరు వివరించారు. నీటి వనరులున్న చోట తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

విగ్రహావిష్కరణకు రావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

మామడ: మండలకేంద్రంలో ఈనెల 22న నిర్వహించే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు మధుకర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుధాకర్, సురేశ్, నరేందర్, సుదర్శన్, రాజేశ్వర్ ఉన్నారు.

స.హ చట్టంపై అవగాహన

తానూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు సమాచార హక్కు చట్టం–2005పై అవగాహన కల్పించారు. ఆ చట్టం జనరల్ కార్యదర్శి సయ్యద్ కలీం మాట్లాడుతూ అభివృద్ధి పనులు, ఖర్చు వివరాలను చట్టం ద్వారా తెలుసుకునే తీరు వివరించారు. కమిటీ సభ్యులు మొహమ్మద్ సలీం, నవీన్, ఆనంద్‌రావ్ పటేల్, ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఉన్నారు.

రక్షక భటులకు రక్షణేది?

- కుభీర్‌లో హెడ్ కానిస్టేబుల్‌పై దాడితో ఉలిక్కి పడిన పోలీసులు
- ఠాణాలోనే దాడి జరగడంపై ఆందోళన



కుభీర్: కుభీర్ పోలీస్ స్టేషన్‌లో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ నారాయణ, హోం గార్డు గిరిధర్‌పై గురువారం రాత్రి 10 గంటల సమయంలో అబ్దుల్ కలీం అనే వ్యక్తి మద్యం మత్తులో కత్తితో దాడిచేశాడు. నారాయణ పొట్టలో కత్తితో పొడిచాడు. హోంగార్డును తోసేయడంతో అతని చేతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన జిల్లా పోలీసులను ఉలిక్కిపడేలా చేసింది. పోలీసు స్టేషన్‌లో భద్రతా లోపాలను బయటపెట్టింది.

మద్యం మత్తులో వీరంగం..

అబ్దుల్ కలీం మద్యం మత్తులో తన భార్య, కొడుకులతో గొడవపడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తామని చెప్పడంతో, కలీం, "పోలీసులు నన్ను ఏం చేస్తారు? నేనే స్టేషన్‌కు వెళతాను" అని చెప్పి కత్తితో ఠాణాకు వెళ్లాడు. ఆ సమయంలో ఎస్సై కృష్ణారెడ్డి అక్కడ లేరు. ఎస్సై గదిలోకి వెళ్తుండగా హెడ్ కానిస్టేబుల్ నారాయణ అడ్డుకున్నాడు. దీంతో కత్తితో దాడి చేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన హోం గార్డ్ గిరిధర్‌ను తోసేశాడు. అరుపులు, కేకలతో స్టేషన్ వెనుక క్వార్టర్స్‌లో ఉన్న సిబ్బంది రాగానే కలీం పారిపోయాడు. శుక్రవారం ఉదయం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. దాడి సంఘటన పోలీసు సిబ్బంది భద్రతపై స్థానికంగా ఆందోళనను రేకెత్తించింది. ఎందుకంటే పోలీసు స్టేషన్‌లోనే ఇలాంటి దాడి జరగడం గమనార్హం.

మద్యం మత్తు, గంజాయి వ్యసనం..

అబ్దుల్ కలీం స్వగ్రామం మహారాష్ట్రలోని ధర్మాబాద్ అయినప్పటికీ అతని కుటుంబం కొన్నేళ్లుగా కుభీర్‌లో నివసిస్తోంది. కలీంకు మద్యం, గంజాయి సేవించే అలవాటు ఉందని స్థానికులు తెలిపారు. నిత్యం తాగొచ్చి కుటుంబసభ్యులతో గొడవ పడతాడు. కుభీర్‌తోపాటు సరిహద్దు గ్రామాల్లో మహారాష్ట్ర నుంచి వచ్చే మద్యం, గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గతంలో గంజాయి సాగు, అమ్మకాలపై కేసులు నమోదైనప్పటికీ దందా ఆగడం లేదు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు లేక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.

భద్రతా లోపాలు..

ఈ ఘటన పోలీసు స్టేషన్‌లో భద్రతా లోపాలను స్పష్టం చేసింది. "పోలీసులకే రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏమిటి?" జిల్లావాసులు ప్రశ్నిస్తున్నారు. గతంలో కుభీర్ పోలీసు స్టేషన్‌లో సెంట్రీ, సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఉండేవారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో భద్రతను సడలించారు. ఇక సీసీ కెమెరాలు కొన్ని పనిచేస్తుండగా, మరికొన్ని పనిచేయడం లేదని సమాచారం. ఈ ప్రాంతంలో బంగారం షాపు, కిరాణా షాపు, ఇళ్లలో చోరీలు, బస్టాండ్ వద్ద చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ భద్రతా చర్యలు మెరుగుపడలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

భద్రత పెంచితేనే..

ఈ ఘటన తర్వాత స్థానికులు సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను బలోపేతం చేయాలని, పోలీసు స్టేషన్‌లో వచ్చే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కోరుతున్నారు. సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలి. సరిహద్దులో చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం, మద్యం, గంజాయి అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి ఘటనలు నివారించవచ్చని స్థానికులు సూచిస్తున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై చర్యలు



ముధోల్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ మల్లేశ్, పోలీస్ సిబ్బంది



సోన్: న్యూవెల్మల్‌లో తనిఖీ చేస్తున్న ఎస్సై గోపి

ముధోల్: మైనర్లకు వాహనాలిస్తే చర్యలు యజమానులపై చర్యలు తీసుకుంటామని ముధోల్ సీఐ మల్లేశ్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం ముధోల్‌లో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈసందర్భంగా మైనర్లు నడిపిన బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ చేశారు. మైనర్లు వాహనాలు నడపడం ద్వారా సంభవించే ప్రమాదాలు, తల్లిదండ్రులు ఎదుర్కొనే పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై బిట్లా పెర్సిస్, ఏఎస్సై గంగాధర్, పోలీసులు తెలిపారు.

బాసర: మండలకేంద్రంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, గోదావరి నది బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనపత్రాలు పరిశీలించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

తానూరు: 18 ఏళ్ల నిండనివారు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై షేక్ జుబేర్ పేర్కొన్నారు. శనివారం తానూరులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు తప్పవని ఎస్సై అశోక్ హెచ్చరించారు. మండలంలోని కుంటాల, కల్లూరు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సిబ్బంది ఉన్నారు.

మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దు

సోన్: మండలంలో వాహనాల తనిఖీ నిర్వహించి.. బైక్‌లపై వెళ్తున్న నలుగురు మైనర్లను పట్టుకొని వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్సై గోపి పేర్కొన్నారు. అంతకుముందు న్యూవెల్మల్‌లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వీడీసీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ పరీక్షలు



పశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో కరాటే అసోసియేషన్ సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని కేజీబీవీలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పోటీలు నిర్వహించారు. కరాటే రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కరాటే పరీక్షకులు సెన్సాయ్ తేజేందర్ సింగ్ భాటియా, కరాటే జిల్లా అధ్యక్షుడు కొండాజీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రేడింగ్ పరీక్షలు జరిగాయి. భైంసా కేజీబీవీ విద్యార్థినులు జూనియర్ రెడ్, యెల్లో, గ్రీన్ బెల్టులు, సర్టిఫికెట్లు అందుకున్నట్లు కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. ఎస్‌ఓ జ్యోతి, మాస్టర్లు జ్ఞానతేజ, లింగం, ప్రతిక్ష, అనన్య, శివరాజ్ పాల్గొన్నారు.

ఎంహెచ్‌పీఎస్ ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్

నిర్మల్‌టౌన్: మాదిగ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నిర్మల్ జిల్లాకు చెందిన సుంకే ప్రభాకర్ నియమితులయ్యారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ హైదరాబాద్‌లో శనివారం నియమాకపత్రం అందజేశారు. సమితి తనపై ఉంచిన విశ్వాసానికి ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. మాదిగ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

విశ్వకర్మ చైతన్య యాత్ర

నిర్మల్‌టౌన్: విశ్వబ్రాహ్మణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని విశ్వకర్మ సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం నిర్మల్‌లో విశ్వకర్మ చైతన్య యాత్ర నిర్వహించారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి శివాజీచౌక్ వరకు యాత్ర కొనసాగింది. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి, నిర్మల్ నియోజకవర్గ కన్వీనర్ అభిలాష్, విశ్వకర్మ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు

ఖానాపూర్: సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 11వ వార్డు పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న ఆదర్శ పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండలాధ్యక్షుడు ఉపేందర్, పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సత్యవతి, నాయకులు శ్రీనివాస్, భూమన్న, స్వామి, రమేశ్, వర్షిత, లక్ష్మి, ప్రసన్న, నారాయణ, రాజ్‌కుమార్, కుమార్, చందు తదితరులు ఉన్నారు.

సరుకులు పంపిణీ

కుంటాల: ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకొని సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింబా(కే)లో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయి సూర్యవంశీ, దత్తు పటేల్, దాసరి సాయన్న, న్యాయవాది నరేశ్, రాజు, రమేశ్, ప్రమోద్ పటేల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు

ముధోల్: రైతులు తమ పంట వివరాలను నమోదు చేసుకుంటే విక్రయించే సమయంలో ఇబ్బందులు తలెత్తవని ఏఈవో సందేశ్ అన్నారు. శనివారం ముధోల్‌లో రైతుల పంట వివరాలను నమోదు చేశారు. రైతులకు పలు సూచనలు చేశారు.

చిన్నారులకు అన్నప్రాసన

దస్తురాబాద్: పోషణమాసంలో భాగంగా మండలంలోని భూత్కూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. సూపర్‌వైజర్ రాధ పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు ప్రేమలత, షైనాజ్ పర్వీనా, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఎదుగుదల

కుంటాల: పోషకాహారం అందిస్తేనే చిన్నారుల్లో ఎదుగుదల ఉంటుందని అంగన్‌వాడీ టీచర్ పద్మ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సూర్యాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. సీమంతాలు, అన్నప్రాసనపై అవగాహన కల్పించి, పోషకాహారం ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగాసాగర, కార్యదర్శి రాజు, ఏఎన్‌ఎం సుజాత, టీచర్ ఫర్జానా తదితరులు పాల్గొన్నారు.

శతక పద్య పఠన పోటీలు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం శతక పద్య పఠన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి బి.బిందుశ్రీ, రెండో బహుమతి మైథిలి, మూడో బహుమతి రిత్విక్, సీనియర్ విభాగంలో మొదటి బహుమతి కీర్తన, రెండో బహుమతి వైశాలి, తృతీయ బహుమతి నవనీత అందుకున్నారు. హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆర్థికసాయం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన భీమన్న ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబీలకు ఇదే గ్రామానికి చెందిన నల్ల వినయ్‌రెడ్డి శనివారం రూ.ఐదు వేలను సాయంగా అందించారు. ప్రణయ్,హరీశ్ తదితరులు ఉన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

లోకేశ్వరం: గ్రామపంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీవో సురేశ్‌చందర్ గౌడ్ అన్నారు. శనివారం మండంలోని పిప్రి, గడ్చాంద గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు, మురుగుకాల్వలు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎంపీవో మాట్లాడుతూ మురికికాలువలు శుభ్రం చేసి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

ఇళ్ల వద్ద చదివేలా చూడాలి

కడెం: విద్యార్థులు ఇళ్ల వద్ద చదువుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని మండలంలోని లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బచ్చు వెంకటరమణ అన్నారు. శనివారం పాఠశాలలో పోషకుల సమావేశం నిర్వహించారు. లింగాపూర్ పాఠశాలలో అందిస్తున్న విద్యను చూసి హైదరాబాద్‌కు చెందిన మేధా ట్రస్ట్ రూ.రెండు కోట్లతో అదనపు గదులు, మరుగుదొడ్లు, ఫిల్టర్ వాటర్ సిస్టమ్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. చదువులో వెనుకబడిన వారి కోసం ట్యూటర్‌ను నియమించారని తెలిపారు.

పోషకులకు సన్మానం

మామడ: మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం పోషకుల సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటరమణరెడ్డి ఆధ్వర్యంలో వందశాతం హాజరు కల్గిన 30 మంది విద్యార్థులను అభినందించి పోషకులను సన్మానించారు. పోషకులు దృష్టి సారిస్తే విద్యార్థులు చదువులో రాణించడం సులభమని పేర్కొన్నారు.

ప్రజాసంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



కొలాంగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని కొలాంగూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి మాట్లాడారు. పేదలకు సన్నబియ్యం అందిస్తూ సొంతింటి కల నెరవేరుస్తుందన్నారు. అంతకుముందు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి పురవీధుల్లో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా ర్యాలీలో పాల్గొన్నారు. గంగపుత్ర సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పట్టణంలోని బొడ్డోనికుంట, కప్పల కుంట చెరువులు కబ్జాకు గురికాకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు దయానంద్, నిమ్మల రమేశ్, మాజిద్, చిన్నం సత్యం, గంగనర్సయ్య, జంగిలి శంకర్, సురేశ్, శేషాద్రి, శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ఖానాపూర్: ప్రభుత్వం వ్యవసాయ యంత్రాలపై ఇచ్చే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సుజాత కోరారు. శనివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం ద్వారా మంజూరైన యంత్రాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ చిన్న, సన్నకారు రైతులకు 50శాతం, ఇతర రైతులకు 40శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన రైతులు కల్టివేటర్, కేజీవీల్స్, పవర్ స్ప్రేయర్, హ్యాండ్ స్ప్రేయర్, బ్రష్ కట్టర్, డిస్క్‌హ్యారో, పవర్ టిల్లర్, రోటోవేటర్, సీడ్ డ్రిల్, పవర్ వీడర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, రెండు పాస్ ఫొటోలు, దరఖాస్తును కార్యాలయంలో అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు స్థానిక కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని కోరారు.

బీరప్ప ఆలయ గోపురం ధ్వంసం



ఆలయం వద్ద పరిశీలిస్తున్న సీఐ మల్లేశ్

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామ శివారులో కుర్మ కులస్తుల ఆరాధ్యదైవం బీరప్ప ఆలయంలో గోపురాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. శుక్రవారం రాత్రి పలువురు గమనించి కుర్మ కులస్తులకు తెలియజేశారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయ గోపురం చుట్టూ గునపంతో ధ్వంసం చేశారన్నారు. వెంటనే క్లూస్ టీంను రప్పించి ఆలయ పరిసరాలు పరిశీలించినట్లు పేర్కొన్నారు. కుర్మ కులస్తుల ఫిర్యాదు చేశారని.. దండుగులను పట్టుకొని చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు. అనంతరం ముధోల్ సీఐ మల్లేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆలయం వద్దకు చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఆలయ గోపురం ధ్వంసం చేయడం హేయమైన చర్య అని నిందితులను పట్టుకొని శిక్షించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. తహసీల్దార్ భోజన్న, నాయకులు రాజేశ్‌బాబు, శ్రీధర్, సాయన్న, రమేశ్, భూమన్న, గోవింద్ ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- నిర్మల్‌రూరల్ సీఐ కృష్ణ
- రాంపూర్‌లో కార్డన్‌సెర్చ్.. పత్రాల్లేని వాహనాలు స్వాధీనం



మాట్లాడుతున్న నిర్మల్‌రూరల్ సీఐ కృష్ణ

నర్సాపూర్(జి): గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, దుకాణాలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్మల్‌రూరల్ సీఐ కృష్ణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాంపూర్ గ్రామంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ధ్రువపత్రాలు సరిగా లేని 74 బైక్‌లు, రెండు ఆటోలు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాల ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వచ్చే దేవీ నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఎస్సైలు గణేశ్, సందీప్, రవీందర్, పోలీస్ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు



లక్ష్మణచాందలోని ప్రభుత్వ పాఠశాలలో..



ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



బాసర: కిర్గుల్(బి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



ఖానాపూర్‌లోని ఓ పాఠశాలలో నిర్వహించిన వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



భైంసారూరల్: వాలేగాం పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, చిన్నారులు



లోకేశ్వరం: రాజూర ప్రాథమిక పాఠశాలలో కోలాటం ఆడుతున్న విద్యార్థులు



సోన్: న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



కుంటాల ఆదర్శ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, సిబ్బంది



తానూరు: ఎల్వి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



కడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో..

జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. అనంతరం సమీపంలోని వాగులు, నీటికుంటల్లో నిమజ్జనం చేశారు. ఖానాపూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

భూమి రిజిస్ట్రేషన్‌పై విచారణ చేయాలని ధర్నా

ఖానాపూర్: తమ తండ్రి భూమిని తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన విషయమై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వరలక్ష్మి ధర్నా చేశారు. బాధితురాలి వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలం గోసంపల్లికి చెందిన తన తల్లిదండ్రులు పెండెం జనార్దన్– లక్ష్మి చనిపోవడంతో వారి పేరిట కొత్తపేట శివారులోని 48 గుంటల వ్యవసాయ భూమి, గోసంపల్లిలో ఉన్న రెండు ఇళ్లను మధ్యవర్తులు అధికారులతో కుమ్మక్కై అక్రమ రిజిస్ట్రేషన్ చేశారన్నారు. తమ తల్లిదండ్రులకు ఆరుగురు సంతానం అయినప్పటికీ ఐదుగురే(తనను మినహాయించి) ఉన్నారని తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించి రిజిస్ట్రేషన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. న్యాయం చేయకుంటే ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించారు. ధర్నాలో వరలక్ష్మి, శ్రీనివాస్, లక్ష్మి, కుటుంబీకులు ఉన్నారు.